# అభిరుచులు

రచన:
"పుష్యమి"

(గత సంచిక తరువాయి)

రామయ్యని డాక్టరు దగ్గిరికి తీసుకెళ్ళాడు హనుమంతరావు. డాక్టరు కళ్ళు రెండూ పరీక్ష చేసి చూసి, యింకా ముదిరితేనేకాని చేయటానికి వీలులేదన్నాడు! ఓ నెల తర్వాత చేస్తానన్నాడు.

పది రోజులలో తెములుతుందనుకున్న ఆపరేషను, నెల ముందుకు జరిగేసరికి, 'ఎలాగరా భగవంతుడా గడిపేది?' అని మనసులో చాలా బాధపడ్డాడు రామయ్య! క్షణమొక యుగంలా గడుస్తోంది కాలం! రత్తమ్మ విసుగు మాటలు రోజురోజుకూ ఎక్కువయిపోతున్నాయి! హనుమంతరావు నిగ్రహంలో అన్నీ వింటూనేవున్నాడు! ఎలాగయిన ఆపరేషన్ పూర్తయితే, రామయ్య తిరిగి తన పాట్లేవో తనుపడతాడని అతని ఆశ! పోనీ, వృద్ధాప్యంలో తండ్రిని తన దగ్గరే వుంచుకుని, సేవజేద్దామంటే;—పరిస్థితులు ఆ భాగ్యాన్ని వెనక్కి నెట్టివేశాయి!

దశరథరామయ్య కళ్ళు పూర్తిగా కనపడడం మానేశాయి! యింట్లో నే వుంటున్న రఘు అతనికి కొంత ఆసరాగావుంటూ, అన్ని పనుల్లోనూ సాయంచేస్తున్నాడు!

డాక్టర్ ఒక్కొక్క కంటికి ఏభయి రూపాయలు పుచ్చుకుంటానన్నాడు ఆపరేషన్‌కి! ఎలాగా రెండు కళ్లూ ఓసారి ఆపరేషన్ చేయడు! ఒక కంటికి చేసి, నెమ్మళించాక, రెండో కంటికి చేస్తాడు! పోనీ ఒక కన్నైనా బాగుపడితే. నిత్యకార్యక్రమాలు అడ్డులేకుండా గడిచిపోతాయని రామయ్య ఆశ!

దశరథరామయ్య తెచ్చిన ఏభయి రూపాయిలూ డాక్టరు ఫీజుకిచ్చినా; మందులకీ వాటికీ యింకా డబ్బు అవసరంవుంటుంది! హనుమంతరావు చేతిలో చూస్తే, చిల్లు కానీ లేదు! తనకి వచ్చే అరవయి రూపాయలూ నెల గడవడానికే చాలటంలేదు! యింక నిలవ ఏం వేస్తాడు?...పోనీ అప్పు చేస్తే—తాను ఎలా తీర్చగలనా అనే ఆలోచన!...

యిలా ఆలోచనలతో సతమతమవుతూ; పగలల్లా కొట్లో పనితో తల దిమ్మెక్కి యింటికి వస్తే, యింట్లో రత్తమ్మ గోల!...హనుమంతరావు మనసుకి శాంతిలేదు! కొట్లో షావుకారు, తానిచ్చే అరవై రూపాయలకే, ఆరు వందల విలువచేసే పని చేయించుకుంటేనే కాని తృప్తిచెందడు! కొట్లో శరీరానికి సౌఖ్యంలేదు!... ఇంట్లో ధ్వనిలో మానసిక శాంతి!—విశ్రాంతిలేని జీవితం గడుపుతున్నాడు హనుమంతరావు.

అలాగే నిర్జీవంగా నెల గడిచింది!—

డాక్టరు, దశరథరామయ్య కుడి కంటికి ఆపరేషన్ చేసాడు! ఏభయి రూపాయిలూ, ఫీజుగా ముందే యిచ్చేశాడు హనుమంతరావు. మరో ఏభయ్యి అప్పు చేయక తప్పలేదు!

ఆపరేషన్ పూర్తయింది!—

రామయ్యని ఆస్పత్రిలోనే ఒక గదిలో ఉంచారు! కదిలిస్తే కన్ను దెబ్బ తింటుందని చెప్పాడు డాక్టర్! కంటికి కట్టు కట్టాడు!

ఆపరేషనయాక ఒకసారి మాత్రం ఆసుపత్రికి వెళ్ళి చూసి వచ్చింది! అంతే!—మళ్ళా ఆవేపు వెళ్ళనేలేదు రత్తమ్మ!

కొట్లోంచి వచ్చాక. రవిని తీసుకుని, ఆస్పత్రిలో పడుకులరుకు రాత్రిళ్ళు తానే వెడుతున్నాడు హనుమంతరావు! ఈ పది రోజులూ పగలు అతనికి సహాయముగా రవిని ఉంచాడు ఆస్పత్రిలో!

నాలుగు రోజుల్లో కట్టు పూర్తిగా విప్పుతానని చెప్పాడు డాక్టర్! ఈలోగా రోజూ కట్టు విప్పి, కంట్లో మందు వేస్తూనేవున్నాడు!

నాలుగు రోజులూ గడిచిపోయాయి!—

హనుమంతరావు హృదయం, పెద్ద రాయితో తప్పుకున్నంత తేలికపడింది! ఒక మహా యజ్ఞం పూర్తి చేసినట్లు, గట్టిగా నిట్టూర్చాడు!

ఆ రోజు మధ్యాహ్నం డాక్టరు వచ్చి కట్టువిప్పాడు! కంటిని బాగా పరీక్షించి చూశాడు!

పక్కనున్న హనుమంతరావు వైపు తిరిగాడు డాక్టర్ ఆతృతగా అడిగాడు హనుమంతరావు, 'డాక్టర్! ఇవాళ యింటికి తీసుకుపోవచ్చునా?'

డాక్టరు సమాధానం యివ్వకుండానే, తిరిగి

రామయ్య కంటిని మరోసారి పరీక్షించాడు! డాక్టరు ఏం చెపుతాడో, ఇవేళేనా యింటికి తీసుకుపోవచ్చునంటాడో, లేదోనని ఆరాటపడుతున్నాడు! ఆస్పత్రిలో గదికికూడా, రోజుకి అర్ధ రూపాయి అద్దె!

డాక్టర్ లేచాడు!...బయటికి నడిచాడు!

వెనకే వెళ్ళాడు హనుమంతరావు.

'ఏవండీ డాక్టరుగారూ! యివాళ పూర్తిగా కట్టు విప్పుతానన్నారుకదా; యింటికి తీసుకుపోవచ్చా?' అనడిగాడు!

డాక్టరు హనుమంతరావు కేసి అదోలా చూచాడు!-

'ఏవండీ?' డాక్టరు మౌనం భరించరానిదిగా ఉంది హృదయం ఎందుకో ఆందోళన పడుతోంది!

చివరికి నోరువిప్పి చెప్పాడు! డాక్టర్!

'హనుమంతరావూ! మీ నాన్నగారి ఆపరేషను, ఫెయిల్యూర్ (Failure) అయిపోయింది!' డాక్టర్ హీనస్వరంలో అన్నాడు! 'కంటికి చేము పట్టేసింది!' ఆలా జరిగినందుకు బాధపడుతున్నట్టు, అతని ముఖంలోని మార్పు స్పష్టం చేస్తోంది!

డాక్టరు మాట విని అదిరిపడ్డాడు హనుమంతరావు. ప్రపంచమంతా కత్తి కట్టి; కఠినశిక్ష వేస్తూందా తనకి?- అనుకున్నాడు!

'ఆఁ!...ఆపరేషను చెడిపోయిందా?' అడిగాడు ఆశ్చర్యంగా!

డాక్టరు మాటాడలేక పోయాడు!

'అది ఏమిటి డాక్టర్?' - హనుమంతరావు కంఠం వణికింది!

'మన దురదృష్టం హనుమంతరావ్! యిలా అవుతుందని నేనూ ఊహించలేదు. నేనూ దీనికి చాలా 'ఫీలవు'తున్నాను.' అన్నాడు డాక్టర్ బాధగా!

హనుమంతరావు డాక్టరు చాలా బాధపడుతున్నట్టు గ్రహించాడు!

'అవును డాక్టర్! దేనికేనా, మానవ ప్రయత్నానికి దేముని సహకారం కూడా వుంటేనే కార్యాలు జయప్రదం అవుతాయి! అది మన అదృష్టాలమీద ఆధారపడి వుంటుంది! కాలం కలసిరాని దానికి; మీరు మాత్రం ఏం చేస్తారు?' అని మాత్రం ఊరుకున్నాడు! డాక్టరుని నిందించి ప్రయోజనం ఏమిటి? నుదుటి గీతలమీద భగవంతుని వ్రాత యిలా ఉన్నపుడు ఎవరేం చేస్తారు? ఆ చేత్తో డాక్టర్ ఎన్ని ఆపరేషన్లు చేయలేదు?... యిది యిలా చెడిందంటే, అది డాక్టరు తెలివితక్కువా మరి? తన దురదృష్టం! - అని ఊరుకున్నాడు!

* * *

దశరథరామయ్యని ఆసుపత్రినించి ఇంటికి తీసుకువచ్చేశాడు! రామయ్య యిక ఎక్కడికీ పోడు! ఆపరేషన్ చేసిన కుడికన్ను రెండు రెప్పలూ పూర్తిగా అంటుకుపోయాయి! రెండోకన్ను అసలే కనిపించదు. యిక రామయ్య బాధ్యత హనుమంతరావుకి తప్పనిసరి అయింది. రత్తమ్మ సాధిస్తోంది కదా అని; కళ్ళులేని పరిస్థితిలో; ముసలి తండ్రిని వదలగలడా? హనుమంతరావే కాదు; ఏ కొడుకూ కన్న తండ్రిని; భార్యనోటికి జడిసి వీధిపాలు చేయలేదు! - అలా చేసేవాళ్లు లేకనూపోలేదు! హృదయం లేని ఏ కొద్దిమందో కాని, కన్నవారి పట్ల క్రూరంగా ప్రవర్తించరు!

రఘుకి బడిబాధలేక; ఎప్పుడూ యింట్లోనే వుంటుండటంమూలాన, రామయ్యకి చేయూత నిస్తున్నాడు! రత్తమ్మ మాత్రం, సణుగుతూ, సాధిస్తూ వండి పడేస్తోంది!

ఒక సంవత్సరం యాంత్రికంగా గడిచింది! -

రామయ్యకి వంట్లో శక్తి పూర్తిగా పోయింది!మనిషి బాగా ఎండిపోయాడు! శరీరం ముడతలు పడిపోయింది! ఎముకలగూడు తప్ప అతని శరీరంలో ఏమీ లేదు!

చేతికి ఆసరాగా వున్న రఘు బడి తెరవగానే ఫస్టుఫారంలో జేరాడు! యిప్పుడు రామయ్యకి మరీ కష్టపరిస్థితి ఏర్పడింది!

రఘు చదువులో రవికంటె కొంచెం తెలివైనవాడే! క్వార్టర్లి పరీక్షలలో అన్నీ ఫస్టుమార్కులొచ్చాయి!- అది చూచిన రత్తమ్మ ఆనందానికి అవధులే లేవు!

హనుమంతరావుకి రామయ్య గురించి ఆలోచన ఎక్కువైపోయింది! రామయ్యకి కళ్ళు లేకపోవడం...తాను బయటికిపోతే అతన్ని చూచే దిక్కైనా యింట్లో లేకపోవడం! రత్తమ్మ ఉన్నా లేనట్టే లెఖ్ఖ! హనుమంతరావలా కొట్లోకి వెళ్ళగానే, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుంటూనే పెత్తనానికి లేచిపోతుంది!

పాపం! తన బాదేదో తా పడుతున్నాడునే

రామయ్య అలాగే తడుముకుంటూ! జీవితం మధ్యలో;- వృద్ధాప్యదశలో; యిలా బరువైన గుడ్డిజీవితం గడపవలసి వస్తుందని గత జీవితకాలంలో ఊహించనైనా లేదు! 'ఈ భూమిమీద యింకా ఎన్నిరోజులో ఋణం!' అనుకుంటూ, దినాల్ని భారంగా గడుపుతున్నా ! జీవితానికి అంత్యదినం ఎప్పుడాసన్నమవుతుందా!-అని ఎదురు చూడాల్సినంత విరక్తి బ్రతుకుపై కలుగుతోంది! తనంటే, ప్రేమ; - ఆదరం లేని వ్యక్తి ఎదురుగా, దీనావస్థలో;- క్లిష్టపరిస్థితుల్లో; - సంక్లిష్ట జీవితాన్ని గడుపుతున్నాడు!

యింట్లో రోగిష్టి మామగారి మంచంకేసైనా చూడక పోయినా; తనకి మామగారి సేవతో నిముషం కూడా తీరికలేదని, బయట అమ్మలక్కలతో దబాయిస్తోంది రత్తమ్మ! - ఆమె చెప్పుకునే గొప్పలు రామయ్య చెవిని పడుతూనే ఉన్నాయి!

'ఎక్కడికి పోతాడింక! శాశ్వతంగా యిక నాకీ చాకిరీ తప్పదు!' - రత్తమ్మ హృదయం కల్మషమయం! కరడు గట్టిన పాషాణ సమానం!!

'ఇలా దయా దాక్షిణ్యాలు లేని మాఘలకి, యిహలోకంలోనే ప్రతిఫలం యిస్తాడు భగవంతుడు! అనుభవిస్తుంది!' అనుకున్నాడు!

ఆ సంవత్సరం జరిగిన ఏనివర్సరీ పోటీలో కూడా ఉత్తమనటనకి వెండికప్పు రవికి వచ్చింది!

ఆ సంవత్సరమే చేరి, వయసులో అందరికన్నా చిన్నవాడయిగా, రఘుకూడా ఓ వెండికప్పు సంపాదించాడు! బడిలో జరిగిన పాటలపోటీలో పాల్గొని మొదటి బహుమతి పొందాడు!

'ఎన్నడూ నోరు మెదపని రఘు పాటలలో ప్రయిజు సంపాదించాడా??...' అని ఆశ్చర్యపోయాడు హనుమంతరావు.

రఘు ప్రతీసినిమా రికార్డునూ జాగ్రత్తగా వింటాడు! అనుకరణ శక్తి అతని సహజాతం! లయజ్ఞానం దానంతట అదే అలవడింది!

మొదటిసారిగా, భయపడుతూనే బడిలో పోటీలో పాడాడు! మొదట ప్రయత్నంలోనే ప్రథమ బహుమానం సంపాదించాడు! అంటే - ఆతనిలో అంతర్గతమై వున్న ఒక శక్తిని వెలుగుకు తీసుకొచ్చాడు! - అందరినీ ఆ శక్తి

నేడే చూడండి!




దర్శకత్వం. M.A. తిరుముగం. మాటలు.పాటలు. గబ్బిట వెంకటరావు. సంగీతం. L. మల్లేశ్వరరావు.

సూదంటుదాయిలా ఆకర్షించింది, ఆశక్తి అభివృద్ధి చెందటానికి తగిన ప్రోత్సాహం, సహకారం అవసరం! అది హనుమంతరావు బాధ్యత!...

అటు రఘులో గొప్ప నటకుడయ్యే లక్షణాలు గోచరిస్తున్నాయి! యిటు రవిలో గొప్ప సంగీతవిద్వాంసుడయ్యే దారులు పొడసూపుతున్నాయి! యిద్దరు కళాకారులను తనకు ప్రసాదించి వారి కళలను వృద్ధి చేయటంలో తనకి పరీక్ష పెట్టాడు దేముడు! తనెలా వారిశక్తులు అభివృద్ధి చెందటానికి సహకరించాలో అర్థం కావటం లేదు! హనుమంతరావు మనసును ఈ విషయం కలవరపెడుతోంది;

రవి ఎప్పుడూ యింట్లో తనలో ఏదో పాడుకుంటూనే వుంటాడు! రఘు, ఊళ్ళో జరిగే ఉత్సవాలలో, రత్తమ్మకి తెలియకుండానే, హనుమంతరావు అనుమతితో నాటికలలో పాల్గొంటూనే ఉన్నాడు!

రఘుకి సంగీతం నేర్పించాలనే వుంది హనుమంతరావుకి! చాలమంది ప్రోత్సాహపరిచారు కూడా! కాని; అసాధ్యం అయిపోయింది! అది ఊహగా మాత్రమే నిలిచిపోయింది!

దశరథరామయ్యకి, దగ్గూ, ఆయాసం పట్టుకున్నాయి. మనిషి మంచాన్ని అంటిపెట్టుకుని, చూడటానికి భయంగా తయారయాడు! రోజురోజుకూ అతని పరిస్థితి విషమిస్తూంది! డాక్టరుకు చూపిస్తే, ఓ యింజెక్షన్ రాసిచ్చాడు! అది తెచ్చి చేస్తే కొంత కుదుటపడుతుందని చెప్పాడు! - ఆ యింజెక్షన్ ఖరీదు యిరవై రూపాయిలు.

ఆర్థికబాధ హనుమంతరావుని అడుగడుక్కీ బ్రహ్మరాక్షసిలా పీడిస్తోంది! క్షణక్షణానికీ డబ్బు అవసరం పెరిగిపోతోంది!...యిరవై రూపాయిలు కాదుకదా, యిరవై నయాపైసాలుకూడా అతని జేబులో లేదా సమయంలో!—అప్పుపుట్టించగల అర్హత అంతకుపూర్వమే పోయింది! కొట్లోకూడా ముందునెల జీతంలో సగం వాడేశాడు! షావుకారు యిక యివ్వడు!!...

ఎటుచూచినా డబ్బు సమస్యే!...ఎలా పరిష్కారం? తన పరిస్థితికి ఎవరో నవ్వుతున్నట్లనిపించింది!...ఆ వికృతపు నవ్వులో హేళన ధ్వనిస్తోంది!...'కన్న తండ్రికి, అవసానదశలో నీవు చేయగలిగిందింతేనా?...' అన్నట్లు వినిపించింది!

'అవును. తానేమీ చేయలేదు! ఘోర పరిస్థితుల్లో, రోగపీడితుడయిన తండ్రి ఎండిన ఎముకలగూడు చూచి; కన్నీరు కార్చడంతప్ప తానేమీ చేయనేలేదు!! తన దరిద్రావస్థలో తండ్రిని విధికి వదిలెయ్యడంతప్ప తాను ఏమీ చేయలేదు!!!...'నిస్సహాయంగా, నిస్పృసలో, నిట్టూర్చి, తడారిన కళ్ళను తుడుచుకున్నాడు హనుమంతరావు!

రామయ్య గుండె వేగంగా పైకీ కిందికీ ఆడుతోంది! ఆపులేని దగ్గుతెరతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు!... గంట గంటకీ జబ్బు పెరుగుతోంది! నాలుగురోజులై కొట్టు మానేసి, తండ్రి మంచాన్నే కనిపెట్టుకు కూర్చున్నాడు హనుమంతరావు!

హనుమంతరావు డబ్బు విషయంలోపడే ఆరాటం!...వేదనా, అతని ముఖాన్ని చూచి గ్రహించగలిగాడు రవి! పధ్నాలుగేళ్లు నిండిన రవికి పరిస్థితులు అర్థమవుతున్నాయి!

రఘుని పక్కగా పిలిచి, అతని చెవిలో ఏదో చెప్పాడు రహస్యంగా! రఘు తల ఆడించి, అటూ, యిటూ ఓసారి చూచి, యింట్లోకి పరుగెత్తాడు!

మూడు వెండి కప్పులూ, మందు చీటీ తెచ్చి రవికిచ్చాడు, రఘు! రవి వాటిని తీసుకుంటూనే బజారువైపు పరుగెత్తాడు!

పండిన ముసలి శరీరంవైపు అలాగే చూస్తూ, నిర్జీవ ప్రతిమలా కూర్చున్నాడు హనుమంతరావు! ఇంట్లో వుండి కూడా, అటువంటి గడ్డు పరిస్థితిలో అటువైపేనా రావడంలేదు రత్తమ్మ! యిలాంటి వింత మనుష్యులు, హృదయంలేని మనుష్యులూ యింకా ఎందరున్నారో! దయాదాక్షిణ్యాలనేవి వారికి పుట్టుకతోనే లేకుండా పుడతారా?...

ఆ సమయంలో ఊపిరి అందక నోరు తెరిచాడు రామయ్య! వికృతంగా ఉన్న అతణ్ని చూడలేక భయంతో, బయటికివచ్చి, రవి వస్తున్నాడేమోనని ఆత్రంగా చూశాడు రఘు!

ఇంటాయన లోపలికి వచ్చి, రామయ్యను చూశాడు ప్రతిమలా ప్రక్కనే కూర్చున్న హనుమంతరావు ఆయన రాకనే గుర్తించలేదు! రామయ్యవైపు చూచి పరిస్థితి ఊహించుకున్నాడాయన!

'హనుమంతరావుగారూ! పరిస్థితి చూస్తే అనుకూలంగా కనపడటంలేదు! మంచం వీధిలో అరుగుమీద వేద్దాం!' అన్నాడు నిర్మొహమాటంగా!

హనుమంతరావు తండ్రివైపోసారి చూచాడు. ఆయన మాటల అంతర్యం గ్రహించాడు!

'అలాగేనండి!' అని మాత్రం అని లేచాడు! యిద్దరూ కలసి మంచం అరుగుమీదికి చేర్చారు!

రామయ్యకి మాట పడిపోయింది! ఏదో చెపుదామని నోరు తెరిచాడు ఆశగా! —మాటలు బయటికి రాలేదు! ...బాధగా మూలిగాడు! అతని రెండు కళ్లూ నీటితో నిండాయి!—చేతితో తడిమి, కొడుకు తల ప్రేమతో నిమిరాడు!...అంతకంటె ఏం చేయలేని పరిస్థితి!...చూడడానికి కళ్లు లేవు! మాట చెప్పటానికి, నోరు కట్టడిపోయింది!

అది చూచి, హనుమంతరావు హృదయం భోరుమంది!—

వీధివైపు చూచాడు హనుమంతరావు ఓసారి!...రవి చేతిలో ఏదో పట్టుకుని పరుగెత్తుకు వస్తున్నాడు!

రామయ్య బాధతో మూలిగాడు!—ఆవైపు తిరిగాడు హనుమంతరావు! గట్టిగా దగ్గాడు రామయ్య! ముఖంలో మార్పు వచ్చేసింది! చూపు మారిపోయింది! హనుమంతరావు పక్కనున్న ఇంటాయనకేసి చూచాడు!

'పట్టండి! కిందికి దింపుదాం,' అన్నాడాయన!

యింజెక్షన్ తెచ్చిన రవి, అదిచూచి, నిశ్చేష్టుడై అక్కడే నిలబడిపోయాడు!—

యింజెక్షన్ బుడ్డి ప్రక్కకు విసిరి, రామయ్యమీద వాలాడు! 'తాతయ్యా!' అని భోరుమన్నాడు!

రఘుపోయి, రత్తమ్మతో చెప్పాడు!—లోపలినించి వింతగా ఏడుస్తూనే బయటికి వచ్చింది రత్తమ్మ!

హనుమంతరావు శవం ప్రక్క అచేతనుడై కూర్చుని వున్నాడు! రత్తమ్మ అరుగుమీద చదికిలపడి, మామగార్ని తలుచుకుంటూ, వీధి అంతా వినబడేలా ఏడుస్తోంది!

శవాన్ని తీసుకుపోయేదాకా, అలాగే నైపుణ్యంగా, ఎంతో అనుభవమున్నట్లే ఏడ్చింది రత్తమ్మ!—ఆ ఏడుపే నా వీధిలో వారికోసం తప్పితే; హృదయంలోంచి వచ్చినది కాదు!

తరువాతి కార్యక్రమం జరపడానికి, ప్రయాసతో అప్పు పుట్టించి, కార్యం పూర్తి చేశాడు హనుమంతరావు.

* * *

ఆ సంవత్సరం రవి పరీక్ష తప్పాడు!—రఘు సెకండు ఫారంలోకి వచ్చాడు! రవికి ఎందుచేతో అసలు చదవాలని లేదు. ఆ పరీక్షలకి శ్రద్ధగా చదవలేదు. అశ్రద్ధవల్లనే పరీక్ష పోయింది!

రవికి జీతం కట్టి, తిరిగి చదివించడానికి తోక అందదు!—అలాగని, వదిలేస్తే, ఏమయిపోతాడోనని భయం!

రవి పరీక్ష తప్పాడని, రవితోపాటు హనుమంతరావుని కూడా సాధించింది రత్తమ్మ! హనుమంతరావే రవి పరీక్ష తప్పటానికి కారకుడంటుంది రత్తమ్మ!

'వాణ్ని నాటకాల్లోకి దింపుతే, వాడు చదువుతాడా?—యిదంతా మీరు చేసిందే!' అని చెప్పి పాడించింది!

'రాత్రీపగలూ, నిద్రహారాలు మానేసి చదివినవాళ్ళంతా పాసవుతున్నారా? అంతా మన రాతలో వుంటుంది!' అన్నాడు హనుమంతరావు!

'మీరిలా వాణ్ని వెనకేసుకు రాబట్టే వాడలా అయాడు!' అంది రత్తమ్మ.

(సశేషం)

కథాంజలి
[చక్కని కథల మాసపత్రిక]
స్థాపితం. 1938.

విడి ప్రతి — 25 న. పై.
సంవత్సర చందా — రూ. 4-00.
(ప్రత్యేక సంచికలతో సహా.)
అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్వదేశమిత్రన్
బుక్ స్టాల్సులలోనూ దొరుకును.